మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని గాలిభీమవరం పంచాయతీ జాగరవానిపాలెం గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన బడిదపోయిన నూకరాజు ఇటావలి అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు కుటుంబ సభ్యులు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా విషయం తెలుసుకొని ఆ గ్రామ జనసైనికులు జనసేన పార్టీ సీనియర్ నాయకులు బలిరెడ్డి అప్పారావు దృష్టికి తీసికెళ్లగా మృతుడు కుటుంబ సభ్యులకి రెండు బియ్యం బస్తాలు, 5 వేలు రూపాయలు శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గాలి భీమవరం పంచాయతీ నాయకులు,కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

అంగన్వాడీ భవనాలకు మోక్షమెప్పుడు...?

- అసంపూర్తిగా అంగన్వాడీ 4,5,6 భవనాలు

విశాలాంధ్ర - మునగపాక: మండల కేంద్రమైన మునగపాక గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న అంగన్వాడీ 4,5,6 భవనాలు ఏళ్ల తరబడి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఈ భవనాలు కొంత కాలంగా స్లాబ్ పనుల వరకు నిర్మించి అసంపూర్తిగా వదిలేశారు. మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా నిర్మాణం పూర్తి చేయడానికి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం ఈ అంగన్వాడీ కేంద్రాలను అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు. నూతనంగా నిర్మిస్తున్న భవనాలు చుట్టూ తుప్పలు పెరిగిపోయాయి. అయినప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ఇప్పటికైనా భవన నిర్మాణాలను పూర్తిచేసి వినియోగంలోకి తీసుకు రావాలని గ్రామస్తులు కోరుతున్నారు. లేకపోతే ఇవి అసాంఘిక కార్యకలాపాలకు అనువుగా మారిపోతాయని వారు పేర్కొన్నారు. ఇప్పటికైనా మునగపాక అంగన్వాడీ 4,5,6 కేంద్రాలను పూర్తి చేయాలని ప్రభుత్వ భవనాల్లోనే అంగన్వాడీ కేంద్రాలను నడపాలని గ్రామస్తులు అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయంపై ఐసిడిఎస్ సి.పి.డి.ఓ ఇందిరా దేవిని వివరణ కోరగా నిధులకు ప్రతిపాదనలు పంపామని, మంజూరైన వెంటనే పనులు మొదలు పెడతామని తెలిపారు.

సాయి మెరైన్ పరిశ్రమలో కార్మికురాలు మృతి పట్ల విచారణ చేపట్టాలి

ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్

విశాలాంధ్ర - అనకాపల్లి: జిల్లాలో ఎస్.రాయవరం మండలం గుడివాడ పంచాయతీ పరిధిలో గల సాయి మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో పని చేస్తున్న ఒరిస్సా కార్మికురాలు మృతి పట్ల సమగ్ర విచారణ చేపట్టాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల కుటుంబానికి రూ.కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించాలని దొరబాబు డిమాండ్ చేశారు. కంపెనీలో పని చేస్తూ మరణించిన వారి వివరాలు యాజమాన్యం గోప్యంగా ఉంచడంలో అనేక అనుమానాలకు దారితీస్తుందని అన్నారు. వలస కార్మికులకు భద్రత కల్పించకుండా వారితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని విమర్శించారు. పరిశ్రమలు నిర్వహిస్తున్న హాస్టల్లో ఉంటున్న కార్మికులకు సక్రమమైన భోజనం వసతి సౌకర్యాలు ఉన్నాయా లేవా అనే అంశంపై అధికారులు పర్యవేక్షణ చేయవలసి వున్నా ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదన్నారు. ఇలాంటి ఘటన జరిగినప్పుడు హడావుడి చేసే అధికారులు ముందస్తు చర్యలు చేపడితే కార్మికుల యొక్క సమస్యలు పరిష్కారం అవుతాయని దొరబాబు అన్నారు. జరిగిన ఘటనపై అధికారులు చిత్త శుద్ధితో సమగ్ర దర్యాప్తు చేసి వాస్తవాలను బయటపెట్టాలని దొరబాబు డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులను కలుపుకొని ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.

మండలంలో భారీ వర్షం

విశాలాంధ్ర - యస్.రాయవరం: ఉదయం నుంచి సాయంత్రం వరకు విపరీతమైన ఎండ కాసింది. శుక్రవారం సాయంత్రం ఆకాశంలో నల్లని మేఘాలు కమ్ముకొని వర్షం ప్రారంభమైంది. మండలంలోని ఎస్.రాయవరం, ధర్మవరం, గోకులపాడు, అడ్డరోడ్డు తదితర ప్రాంతాల్లో సుమారు గంట పైగా వర్షం కురవడంతో ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోయింది. వర్షం పడడంతో ప్రజలకు ఉపశయం కలిగింది. ధర్మవరం గ్రామంలో జాతీయ రహదారిపై పడిన వర్షం ఎస్ రాయవరం వెళ్లే మార్గంలో వెళ్లడంతో ఆ రోడ్డుపై నీరు నిలిచిపోతుంది.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

విశాలాంధ్ర - సబ్బవరం: మండలంలోని అంతకాపల్లి గ్రామానికి చెందిన వెన్నెల నాయుడికి మెరుగైన చికిత్స కోసం సీఎం సహాయ నిధి నుంచి రూ.30,786 వేలు మంజూరయ్యాయి. దీనికి సంబంధించి చెక్కును పెందుర్తి

నియోజకవర్గ శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ఆదేశాల మేరకు సబ్బవరం జనసేన పార్టీ కార్యాలయంలో మండల జనసేన పార్టీ అధ్యక్షులు కర్రి కనకరాజు ఆధ్వర్యంలో మండల టీడీపీ మాజీ అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు సమక్షంలో వెన్నెల నాయుడు కుటుంబ సభ్యులకి రూ.30786 వేలు చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మామిడి లక్ష్మి కొండాజీ, జనసేన నాయకులు బంతి కోళ్ల పద్మ,గొర్లి నూకరాజు, పల్లా రమణ,కర్రీ నరసింగరావు, తాటిపాముల శేఖర్,సబ్బవరపు రమణ ,సబ్బవరపునాయుడు,జెట్టి ప్రసాదు, పల్లి మంగరాజు, వాకాడు తేజ, జెట్టి అప్పలరాజు, వాకాడ సత్తిబాబు, మండల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు బకాయి జీతాలు చెల్లించాలి

కోన లక్ష్మణ డిమాండ్

విశాలాంధ్ర - అనకాపల్లి: ఎన్టీఆర్ ఆసుపత్రిలో పని చేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్ కార్మికులకు బకాయి పడ్డ 3నెలల జీతాలు తక్షణమే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్, ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. ఇటీవల నూతన బాధ్యతలు చేపట్టిన ఆసుపత్రి సూపరింటెండెంట్ కృష్ణకు శుక్రవారం కార్మికులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల నుంచి రానున్న సెక్యూరిటీ, శానిటేషన్ నూతన కాంట్రాక్టర్లు అయిన ప్రభుత్వం జీవో ప్రకారం కార్మికులకు కనీస వేతనం అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు, కనీస వేతనం అమలు కృషి చేస్తాం అని తెలిపారు. కార్యక్రమంలో వడ్డాది ఈశ్వరరావు, వెంకట లక్ష్మి, బిఎల్ రాజు, ప్రసాద్, నవీన్, జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయునికి భక్తజన నీరాజనం

విశాలాంధ్ర-మునగపాక: మండలంలోని తోటాడ పంచాయతీ గవర్ల అనకాపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ ప్రసన్నాంజనేయ

ఆలయంలో చతుర్థి వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం విఘ్నేశ్వర పూజ,పుణ్యాహవాచనం, నీరాజన మంత్రం పుష్పం, పాంచగవ్యం, పంచామృత అభిషేకం,హెూమాలు చేశారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై స్వామి వారికి పూజలు చేశారు. పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: డీఎంహెచ్ఓ డా. శాంతిప్రభ

విశాలాంధ్ర - అనకాపల్లి: యోగా వల్ల ఆరోగ్యం బాగుంటుందని ప్రతి ఒక్కరూ విధిగా రోజు యోగ సాధన చేసినట్లయితే మనుషులు రోగాలు బారిన పడకుండా ఆరోగ్యంగా, సంపూర్ణంగా, ప్రశాంతంగా జీవిస్తారని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.శాంతి ప్రభ అన్నారు. యోగాంధ్ర -2025 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పట్టణంలో స్థానిక రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఉదయం ఏడు గంటల నుండి 9 గంటల వరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, జిల్లాలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య అధికారులతో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి యోగా గురువుల పర్యవేక్షణలో యోగాసనలు వెయ్యడం జరిగింది. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.శాంతి ప్రభ, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ కె లావణ్య ఆధ్వర్యంలో యోగాపై అవగాహన ర్యాలీని రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం నుండి ఎన్. టి. ఆర్, జిల్లా కేంద్ర ఆసుపత్రి వరకు భారీ ర్యాలీ నిర్వహించి యోగాంధ్రపై ప్రజలను చైతన్య పరచడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జిల్లా లెప్రసీ అధికారి బాలాజీ, నర్సీపట్నం ఉప వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.కె.విరజ్యోతి, జాతీయ ఆరోగ్య యషన్ జిల్లా అధికారి డా. ప్రశాంతి, జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డా. చంద్రశేఖర్ దేవ్, ఆర్ఎంఓ గౌతమ్, అనకాపల్లి ఎన్.టి.ఆర్. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావు, జిల్లా వైద్య ఆరోగ్య కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత పెంపొందించుకోవాలి: చిన్న జీయర్ స్వామి

విశాలాంధ్ర - గొలుగొండ: సాంస్కృతిక సాంప్రదాయ ఆధ్యాత్మిక పెంపొందించేలా, దేశానికి ఉపయోగపడేలా మీ సంతానాన్ని తీర్చిదిద్దాలని శ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం ఉదయం ఆదివాసి 108 సామూహిక వివాహాలు గొలుగొండ మండలం కృష్ణా దేవి పేటలో జరిగిన నేపథ్యంలో ఉదయం చెక్క వెంకట పద్మావతి కళ్యాణ మండపంలో భక్తులకు, స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు తీర్థం అందించారు. అనంతరం స్వతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు, గంటం దొర సమాధులు ఉన్న నందనవనాన్ని సందర్శించారు. తంగేటి శ్రీనివాస కళ్యాణమండపంలో ఆదివాసి 108 వివాహ వేడుకల్లో నూతన వధూవరులకు ముత్యం వగడాలతో కూడిన మూడు గ్రాముల బంగారు మంగళ సూత్రాలను చిన్న జీయర్ స్వామి స్పీకర్ అయ్యన్న చేతుల మీదుగా దంపతులకు అందించారు. ఈ సందర్భంగా చిన్న జీయర్ స్వామి మాట్లాడుతూ రాముడు జన్మించిన గడియల్లో కళ్యాణం జరుపుకోవడం ఎంతో శుభసూచకమని అన్నారు. మంచి గడియల్లో వివాహాలు జరుపుకుంటున్న వారంతా ఎంతో పుణ్య దంపతులని అన్నారు. ట్రస్ట్ సభ్యులు గుండా మల్లయ్య మిత్రబృందంతో కలసి 20 లక్షల రూపాయల విలువైన బంగారు సూత్రాలను 108 వివాహ జంటలకు అందించడం శుభ పరిణామం అని అన్నారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాజీ ఎంపీ కొట్టేటి మాధవి హైదరాబాదు నుండి వేద పండితులు నూతన జంటలను ఆశీర్వదించడానికి రావడం శుభపరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, విశాఖ తరంగిణి కేంద్ర కమిటీ, దానధర్మ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు పూటు పూరి వెంకట, కంచర్ల రాజా, ఉల్లి అనిల్ కుమార్, రాట్నాల సూర్య, డివిడి ప్రసాద్, వికాస తరంగిణి సభ్యులు పాల్గొన్నారు.

యువతి హత్య కేసును ఛేదించిన పోలీసులు

విశాలాంధ్ర - యలమంచిలి: నియోజకవర్గ కేంద్రం యలమంచిలి సమీపంలో జాతీయ రహదారి పక్కన సుమారు రెండు సంవత్సరాల క్రితం యువతిని హత్య చేసిన కేసును ఎట్టకేలకు యలమంచిలి పోలీసులు ఛేదించారు. ఈ కేసుకు సంబంధించి శుక్రవారం పట్టణ పోలీస్ స్టేషన్లో డీఎస్పీ విష్ణు స్వరూప్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ కేసుకు సంబంధించి డిఎస్పి విష్ణు స్వరూప్, సిఐ ధనుంజయరావులు అందించిన వివరాలు ప్రకారం. యువతిని హత్య చేసిన కేసులో యలమంచిలి పట్టణానికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్టు చేసినట్లు తెలిపారు. యలమంచిలికి చెందిన ప్రగడ రవితేజ, ఎస్.సాయి కృష్ణ, బంగారి శివ ఈ ముగ్గురుని హత్య కేసులో నిందితులుగా అరెస్టు చేసి కోర్టుకు తరలిస్తున్నట్లు తెలిపారు. 2023 సంవత్సరం ఫిబ్రవరి 2వ తేదీన పట్టణ సమీపంలోని బిపిసిఎల్ పెట్రోల్ బంకు జాతీయ రహదారి పక్కన అనకాపల్లి జిల్లా, పూడిమడక గ్రామానికి చెందిన ఎల్లబిల్లి దివ్యను హత్య చేసి గుర్తుపట్టనట్టుగా తగలబెట్టినట్లు తెలిపారు. అప్పటి పోలీసులు కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. యలమంచిలి సిఐ ధనుంజయరావు ఈ కేసు ఛేదించేందుకు కృషి చేశారని టెక్నికల్ పరిజ్ఞానం ఉపయోగించి ఈ కేసుకు సంబంధించి పూర్తి ఆధారాలను సేకరించి యలమంచిలికి చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఈ కేసును చేదించిన సీఐ ధనుంజయ్‌రావు, ఎస్ఐ సావిత్రిలను డీఎస్పీ అభినందించారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో అనుక్షణం ఈ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఛేదించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ ధనుంజయ రావు, ఎస్ఐ కే సావిత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కోదండ రామస్వామి ఆలయంలో ఘనంగా విగ్రహాల ప్రతిష్ట

విశాలాంధ్ర - పాయకరావుపేట: మండలంలోని పెదరామభద్రపురం గ్రామంలో దేవాదాయశాఖ, ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో కోదండ రామస్వామి ఆలయంలో నూతనంగా విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వస్తి వాచకం, పుణ్యాహవాచకం, త్రిషవనస్నానం, రత్నన్యాసం, యంత్ర స్థాపన, కళావాహన గోదర్శనం, అష్ట బంధనం, శాంతికార కళ్యాణం, అన్న సమారాధన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ చైర్మన్ తాడి రామకృష్ణ ఆధ్వర్యంలో నాయకులు పెదిరెడ్డి చిట్టిబాబు, తోట నగేష్, కంకిపాటి వెంకటేశ్వరరావు. చింతకాయల రాంబాబు, మజ్జూరి నారాయణరావు, జూరెడ్డి ప్రసాద్, వల్లా విలియం కేరి, వేములపూడి అప్పారావు, గొల్లపల్లి నాగు, ఏనుగు చిన్న, కాంద్రేకుల ధనలక్ష్మి, కాంద్రేగుల నాగేశ్వరరావు, దేవస్థానం కమిటీ సభ్యులు సింగంశెట్టి నాగేశ్వరరావు, కలిగట్ల శ్రీనివాసరావు, నారపురెడ్డి మునిలి, నారపరెడ్డి కొండబాబు తదితరులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

రొయ్యల పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని గుడివాడ రెవెన్యూ పరిధిలో సాయి మెరైన్ రొయ్యల పరిశ్రమంలో జరిగిన సంఘటనపై విచారణ జరిపి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యులు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఈ పరిశ్రమలో పనిచేస్తున్న ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్ ప్రాంతంకు చెందిన హులకా అనిత మృతి చెందిన విషయం తెలిసిందేనని, అయితే పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం ఉందని, కనీసం పట్టించుకోకుండా మృతురాలు కుటుంబానికి తూతూ మంత్రంగా 2 లక్షల 50 వేల రూపాయలు నష్టపరిహారం ఇవ్వడం ఎంతవరకు సమంజసం అని అన్నారు. కార్మిక చట్టాలు ప్రకారం కంపెనీ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ఈ పరిశ్రమంలో కార్మిక చట్టాలు అమలు చేయాలని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత ఇప్పటికీ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో రాజేష్, చిరంజీవి, బాబ్జి తదితరు పాల్గొన్నారు.

దంత సంరక్షణతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర - అచ్యుతాపురం : దంత సంరక్షణతోనే ఆరోగ్యంగా ఉంటామని వైద్యులు అడిగర్ల సుధీర్ అన్నారు. రగ్బీ కోచ్ వెంకట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విఆర్ సమ్మర్ క్యాంప్‌లో పిల్లలకు శుక్రవారం శ్రీ విష్ణు డెంటల్ కాస్మొటిక్స్ సహకారంతో క్రీడాకారులకు ఎత్తు , బరువు చూసి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వైద్యులు సుధీర్ మాట్లాడుతూ నోరు దుర్వాసన రాకుండా ప్రతి రోజూ రెండు సార్లు బ్రెస్ చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు మౌనిక, సత్య, బిజెపి మండల అధ్యక్షులు కూండ్రపు నాయుడుబాబు, కోచ్ సుబ్రమణ్యం, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు పొడిగింపు

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: రాష్ట్రంలోని జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల గడువు ముగుస్తున్న నేపథ్యంలో జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల కాలపరిమితిని మరో మూడు నెలలు పాటు జూన్ 1 నుండి ఆగష్టు 31 వరకు లేదా కొత్త కార్డులు జారీ ప్రక్రియ చేయడం గానీ ఏది ముందు జరిగితే అప్పటివరకు ప్రభుత్వం పొడిగింపు ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ తెలిపారు. ప్రస్తుతం మే 31 నాటికి అక్రిడిటేషన్ కార్డులు కలిగి పనిచేస్తున్న పాత్రికేయులకు మరో మూడు నెలలు వరకు ఈ పొడిగింపు సౌకర్యం వర్తిస్తుందని జిల్లా కలెక్టరు తెలియజేసారు. ప్రస్తుతం జిల్లాలో పనిచేస్తున్న పాత్రికేయులు సంబంధిత యాజమాన్యం నుండి పొందిన లేఖలను జిల్లా సమాచార పౌర సంబంధాల అదికారి కార్యాలయంలో అందజేసి, అక్రిడిటేషను కార్డులు పొడిగింపు చేసుకోవాలని తెలిపారు.

గుడివాడలో యోగాంధ్ర

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని గుడివాడ గ్రామంలో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన యోగ కార్యక్రమంలో గ్రామంలోని పలువురికి శిక్షణ ఇచ్చారు. యోగా వల్ల ఉపయోగాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దూళి శ్రీనుబాబు, మాజీ సర్పంచ్ నల్లపరాజు వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

పరాయి పంచన పాలిటెక్నిక్ కళాశాల

విశాలాంధ్ర - చోడవరం: పరాయి పంచన ...శిథిలస్థితిలో .... అనకాపల్లి జిల్లా చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల బిక్కు బిక్కున కాలం వెళ్లదీస్తోంది. శిథిల స్థితిలోకి చేరుకున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనాలను విశాఖ డెయిరీ నిధులతో పునర్నిర్మించిన భవనాల్లో 2017లో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ప్రారంభించారు. రెండు గ్రూపులు, సుమారు 200 మంది విద్యార్థిని, విద్యార్థులతో కొనసాగుతున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వర్షం వస్తే భవనాలన్నీ కారిపోతూ కాలం వెళ్లదీస్తున్నట్లు ప్రిన్సిపాల్, విద్యార్థులు చెబుతున్నారు. చినుకు పడితే చిత్తడవుతున్న తరగతి గదుల్లో కంప్యూటర్లు, రికార్డులు, సామగ్రి తడిసిపోకుండా పాలథీన్ కవర్లు, గొడుగులు కప్పుకుంటూ బిక్కు బిక్కున కాలం వెళ్లదీస్తున్నామని విద్యార్థులు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు మారినను, పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనాలు సమకూర్చడంలో ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. ఎన్నికల ముందు ఏదో చేస్తామనే వాగ్దానాలతో అందలమెక్కుతున్న ప్రజా ప్రతినిధులు విద్యార్థులు, ప్రజల సంక్షేమాన్ని విస్మరిస్తున్నారని విద్యార్థి మహిళా ప్రజా సంఘాలు ఆరోపిస్తున్నాయి. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనాలు లేకపోవడంతో, పరాయి పంచనే (ఉన్నత పాఠశాల శిథిల భవనాల్లో) బిక్కు బిక్కున కాలం వెళ్లదీస్తున్నారు. ప్రాంగణ ఇంటర్వ్యూలతో ఇప్పుడిప్పుడే అభివృద్ధి చెందుతున్న చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు పొంచి ఉన్న ప్రమాదంతో.... ఇక్కడ చేరేందుకు నూతన విద్యార్థులు వెనకడుగు వేస్తున్నారు. ప్రభుత్వ సాంకేతిక విద్యా శాఖ ఉన్నతాధికారులు, జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణమే చోడవరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు సొంత భవనాలు ఏర్పరిచి, పొంచివున్న ప్రమాదం నుండి విద్యార్థులను రక్షించవలసినదిగా తల్లిదండ్రులు, అధ్యాపకులు, ప్రిన్సిపాల్, ప్రజా మహిళ సంఘాలు వారు కోరుతున్నారు.